వృథాగా పోతున్న నీరు

- చేపలకోసం నీటిని వదులుతున్న మత్స్యకారులు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

పర్వతగిరి: మండల కేంద్రంలోని పెద్దచెరువు రిజర్వాయర్ 0.22 నీటి సామర్థ్యం కలిగి ఉంది. ప్రతీఏటా ఈ రిజర్వాయర్ ద్వారా ఖరీఫ్, రబీ పంటలకు నీరందుతుంది. ఈ రిజర్వాయర్‌లో చేపల కోసం మత్స్యకారులు నీటిని వదలడంతో కింద ఉన్న పోలుకమ్మ చెరువు నీటిమత్తడి పోయడంతో నీరు వృథాగా పోతుంది. వేసవిలో నీటిని వృథాగా పోకుండా కాపాడాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం రైతాంగానికి మింగుడు పడడం లేదు. రాష్ట్రంలో కరువుఛాయలు ఏర్పడి భూగర్భ జలాలు అడుగంటి జలాశయాలు ఎండిపోతున్న క్రమంలో పెద్ద చెరువు రిజర్వాయర్‌లో పూర్తి స్థాయిలో నీటిమట్టం ఉన్నప్పటికీ మత్స్యకారులు చేపల వేట కోసం నీటిని తగ్గించడంతో నీటి నిల్వ సుమారు 0.8కు చేరుకుంది. గతంలో మొన్నటి వరకు 0.22 టీఎంసీలు ఉన్న నీరు కేవలం నెల రోజుల వ్యవధిలోనే 0.8కు చేరుకోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి వర్షాలు పడని సమయంలో పెద్ద చెరువు రిజర్వాయర్ నీటితో ఖరీఫ్ పంటలు పండించొచ్చని రైతులు భావిస్తున్నప్పటికీ ఆ పరిస్థితి లేకుండా పోయింది. వృథాగా పోతున్న నీటితో కొన్ని పంటలు పాడై పోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథాగా పోతున్న నీటిని అరికట్టాలని రైతులు కోరుతున్నారు.


పెద్ద చెరువు రిజర్వాయర్ కాల్వ నుంచి వృథాగా పోతున్న నీరు


పెద్ద చెరువు రిజర్వాయర్

లోపించిన అధికారుల పర్యవేక్షణ



పెద్ద చెరువు రిజర్వాయర్ నీటిపై అధికారుల పర్యవేక్షణ లోపించింది. మత్స్యకారులు చేపలు పట్టేందుకు 24 గంటలు నీటిని వదులుతున్నారు. దీంతో పోలుకమ్మ చెరువు, కల్లెడ ఊరచెరువు పూర్తిగా నిండిపోతున్నాయి. వృథాగా నీరు వెళ్లిపోవడం వల్ల వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఉంది.

– ప్రేమ్‌చందర్‌రావు, రైతు

ఎస్సారెస్పీ ద్వారా నీటిని నింపాలి



పెద్ద చెరువు రిజర్వాయర్‌లోకి ఎస్సారెస్పీ ద్వారా వస్తున్న నీటిని అధికారుల పర్యవేక్షణలో నింపాలి. చేపల కోసం నీటిని వదలడంతో చెరువు ఖాళీ అయింది. అధికారులు పర్యవేక్షించి 0.22 గల నీటి సామర్థ్యం రిజర్వు చేయాలి. చెరువులోని నీరు వృథాగా పోకుండా గేట్లు మూసివేయాలి.

– సుధీర్‌రావు, రైతు

పండుగలు మతసామరస్యానికి ప్రతీక


నెక్కొండ : దుర్గమ్మ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి


పర్వతగిరి : ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ: పండుగలు మతసామరస్యానికి ప్రతీకలుగా నిలుస్తాయని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని అప్పల్‌రావుపేట శివారు అవుసుల తండా, పెద్దకొర్పోలు శివారు వెంకట్‌తండా జీపీ పరిధిలోని దుర్గమ్మ ఆలయాల్లో మంగళవారం జరిగిన పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తండాల్లో నెలకొల్పుతున్న దుర్గమ్మ ఆలయాలతో గిరిజనుల్లో భక్తి భావం నెలకొంటుందని అన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, మండల, పట్టణ అధ్యక్షులు బక్కి అశోక్, పెండ్యాల హరిప్రసాద్, ఎంపీటీసీ కక్ర సుకన్య, మాజీ మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు శ్రీపాల్‌రెడ్డి, రఘు, గై లక్ష్మణ్, యాదగిరి, చెన్నారెడ్డి, రవి, భీమన్న, శ్రీకాంత్, సాయికృష్ణ, వీరన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

పర్వతగిరి: మండలంలోని ఏబీతండాలో దుర్గమ్మ పండగ వేడుకను తండావాసులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని దుర్గమ్మగుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మాలోతు రవి, మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్‌నాయక్, జెడ్పీటీసీ సింగ్‌లాల్, ఎంపీటీసీ బొట్ల మహేంద్ర, సావిత్రి, భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.


ఖానాపురం : దుర్గమ్మకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది, నాయకులు

భక్తిశ్రద్ధలతో దుర్గమ్మకు పూజలు

ఖానాపురం: మండలంలోని కోమటిపల్లి తండాలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తండాలో బంజారుల ఆరాధ్యదైవం అయిన దుర్గమ్మకు నూతనంగా ఆలయాన్ని నిర్మించడంతో పండుగను చేపట్టారు. దీంతో తండాలోని ప్రజలంతా భక్తిశ్రద్ధల మధ్య పూజలు చేపట్టారు. దుర్గమ్మ దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డితో పాటు ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మాజీ సర్పంచ్‌లు పద్మావతి వెంకన్ననాయక్, సుమన్, సొసైటీ డైరెక్టర్ రాజు, భూస అశోక్‌యాదవ్, బోడ పూలునాయక్‌లు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో తండావాసులు పాల్గొన్నారు. కాగా బుధరావుపేటలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉబేదుల్లా కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు.

కాంగ్రెస్ అసమర్థ పాలనతో సంక్షోభం

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ఖానాపురం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని బుధరావుపేటలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర్, శ్రీశైలం, కాళేశ్వరం, దేవాదుల ఆయకట్టు పంటలకు నీరందిస్తామని ప్రకటన చేసిన కాంగ్రెస్ ఎందుకు ఇవ్వలేకపోతుందన్నారు. మార్చి 31న ఎల్ఎండీ దగ్గర నీరు నిలిపివేసినట్లు ప్రకటన చేయడం జరిగిందన్నారు. పాకాల ఆయకట్టు కింద వందశాతం పంటలకు నీరు ఇస్తామని ఎందుకు ఇవ్వలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల తప్పుడు ప్రకటనతో రైతులు నష్టపోయారని, ఇరిగేషన్ అధికారులతో కనీసం రివ్యూ పెట్టని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రైతులకు సమాధానం చెప్పాలన్నారు. డీబీఎం 38, 40ల ద్వారా చెరువులకు నీరు ఇవ్వలేని కాంగ్రెస్ నాయకుల బట్టలు ఊడదీసి కొట్టాలన్నారు. పంటలకు నీరందకుండా నష్టపోతే పందికొక్కుల వలే కాంగ్రెస్ నాయకులు ఎక్కడ దాక్కున్నారని ఎద్దేవా చేశారు. గత సంవత్సరం, ప్రస్తుత పంటల వివరాలతో సమావేశం పెట్టే దమ్ముందా అని సవాల్ విసిరారు. నష్టపోయిన పంటలపై వ్యవసాయ శాఖతో సర్వే చేయించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ తప్పిదాల వలన నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం ఇవ్వాలని, ఈనెల 6న రైతులకు మద్దతుగా నర్సంపేటలో నిరసన దీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. కేసీఆర్ రైతుల వద్దకు రాగానే కాళేశ్వరం, సాగర్‌లో నీరు ఎలా వచ్చిందన్నారు. సమావేశంలో ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటనర్సయ్య, కోఆప్షన్ మెంబర్ మస్తాన్, వెంకట్‌రెడ్డి, కాస ప్రవీణ్‌కుమార్, భూస అశోక్, సదర్‌లాల్, మౌశాన, పసునూరి ప్రశాంత్, యాదగిరి, సుమన్, తదితరులు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

వింత గొర్రెపిల్ల జననం

నల్లబెల్లి: వింత గొర్రె పిల్ల జన్మించిన సంఘటన మండలంలోని నందిగామలో మంగళవారం చోటు చేసుకుంది. నందిగామకు చెందిన చిట్టి లింగయ్య కొంత కాలంగా గొర్రెలను పెంచుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈక్రమంలో వింత ఆకారంలో గొర్రె పిల్ల జన్మించింది. కొద్దిసేపటి తర్వాత అది మృతి చెందింది. కాంజెనైటల్ డిఫెక్ట్‌తో వింత ఆకారంలో జీవాలు జన్మిస్తాయని స్థానిక పశు వైద్యాధికారి శ్రీనాథ్ పేర్కొన్నారు.

బైక్ అపహరణ

సంగెం: ఇంటి ముందు ఉంచిన ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి అపహరించినట్లు ఎస్సై ఎల్.నరేష్ మంగళవారం తెలిపారు. మార్చి 22వ తేదీన మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి రాజు తన ఇంటి ముందు వద్ద ప్రభుత్వ జూనియర్ కళాశాల కంపౌండ్ గోడ పక్కన ద్విచక్రవాహనం పార్కు చేయగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారని తెలిపారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.

మాదిగలను మోసం చేసిన కడియం


మాట్లాడుతున్న యాకయ్య

నెక్కొండ: దళిత జాతిని అడ్డుపెట్టుకుని రాజకీయంగా ఎదిగిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఏనాడు దళితుల్ని పట్టించుకోలేదని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర నాయకుడు ఈదునూరి యాకయ్య ఆరోపించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఊసరవెల్లిలా కడియం శ్రీహరి పార్టీలు మారడం సరికాదన్నారు. తన స్వార్థం కోసం కన్న తల్లిలాంటి పార్టీలకు మోసం ఎలా చేశారని కడియంను నిలదీశారు. తక్షణమే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మాదిగల శాతం ఎక్కువ ఉన్నందున్న అదే సామాజిక వర్గానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడైన వంగపల్లి శ్రీనివాస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరుపున టికెట్ కేటాయించాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మేశి శోభన్, జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం రమేష్, మండల అధ్యక్షుడు తడుగుల జనార్దన్, రాజు, విజేందర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక


రాయపర్తి: బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన కార్యకర్తలు


సంగెం: కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచ్ కిశోర్ యాదవ్, నాయకులతో ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

రాయపర్తి: మండలంలోని మైలారం, సూర్యతండా, ఊకల్ తదితర గ్రామాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సిరెడ్డి సమక్షంలో హైదరాబాద్ గాంధీభవన్‌లో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, నంగునూరి అశోక్, మాచర్ల ప్రభాకర్, కృష్ణారెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, ఉల్లెంగుల నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ సర్పంచ్

సంగెం: మండలంలోని ఆశాలపల్లి మాజీ సర్పంచ్ బొల్లెబోయిన కిశోర్‌యాదవ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు మండల పార్టీ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి తెలిపారు. సోమవారం రాత్రి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి నివాసంలో పరకాల అధికార ప్రతినిధి జనగాం రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో కిశోర్‌యాదవ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన వెంట 150 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో రమేష్, రవికుమార్, హరిబాబు, బిక్కిరెడ్డి సంధ్యారాణి తదితరుల ఉన్నారు.

బహుజనవీరుడు సర్దార్ సర్వాయి పాపన్న

దుగ్గొండి: బహుజనులందరినీ ఏకం చేసిన తొలి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న అని గౌడ జనహక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని మల్లంపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్నగౌడ్ చిత్రపటానికి శ్రీనివాస్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బహుజన రాజ్యాధికారం చేపట్టిన మొదటి వ్యక్తిగా పాపన్న చరిత్ర పుటల్లో నిలిచారన్నారు. కార్యక్రమంలో తడుక కొంరయ్య, రమేష్, రామకృష్ణ, సదానందం, కుమారస్వామి, రాములు, రాజు, సాంబయ్య, భిక్షపతి, సారంగం, సాంబమూర్తి, రమేష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

బహుజన చక్రవర్తి పాపన్నగౌడ్

పర్వతగిరి: మొగలుల ఆగడాలు, ఆకృత్యాలపై పోరాడిన బహుజన చక్రవర్తి సర్వాయి సర్దార్ పాపన్నగౌడ్ అని తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతంగౌడ్, మండల అధ్యక్షులు రంగు జనార్దన్‌గౌడ్, స్వామి వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు చేబెల్లి మహేందర్ అన్నారు. పాపన్నగౌడ్ వర్ధంతిని మండలంలోని అన్నారం షరీఫ్‌లో మంగళవారం పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రజితకుమార్, తెలంగాణ గౌడ జిల్లా ఉపాధ్యక్షుడు బాల్య వెంకటరాజు, రంగు కుమార్‌గౌడ్, శేషయ్యగౌడ్, సుదర్శన్, రమేష్, రాములు, సంతోష్‌కుమార్,జలందర్‌గౌడ్, సంతోష్‌గౌడ్, జంపయ్య,సుధాకర్, కాంగ్రెస్ నాయకులు, జి.రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.


దుగ్గొండి: సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మోకుదెబ్బ బాధ్యులు


పర్వతగిరి: పాపన్నగౌడ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చేబెల్లి మహేందర్

ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

దుగ్గొండి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేసిన కూలీలకు 2 నెలలుగా వేతనాలు అందించడం లేదని వెంటనే వేతనం అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పుచ్చకాయల నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి కూలీలతో సంఘం నాయకులు మంగళవారం మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు పనిభద్రత కల్పించడం కోసం తీసుకొచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో రోజు రోజుకు పనులు తగ్గిస్తున్నారన్నారు. పనికి పోయినా రూ.100కు మించి కూలి గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోజువారి కూలి రూ.400 చెల్లించాలని లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సక్క, రమ్య, ప్రమీల, శ్యామల, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.


కూలీలనుద్దేశించి మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

గుండెపోటుతో టీఏ మృతి

కొత్తగూడ: ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగార్జున(35) గుండెపోటుతో మంగళవారం మృతి చెందాడు. నర్సంపేటకు చెందిన నాగార్జున సుమారు 9ఏళ్లుగా మండలంలో టీఏగా పని చేస్తున్నాడు.

బీజేపీకి సందీప్‌రెడ్డి రాజీనామా

రాయపర్తి: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తున్న తాళ్ల సందీప్‌రెడ్డి ఆ పార్టీ క్రియాశీల సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపాడు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదిహేను సంవత్సరాలుగా బీజేపీలో పనిచేస్తున్నప్పటికీ పార్టీలో సరైన గుర్తింపు ఇవ్వడం లేదన్నారు. పార్టీలో బూత్ అధ్యక్షుడిగా, శక్తికేంద్రం ఇన్‌చార్జ్‌గా, మండల ప్రధానకార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యుడిగా పని చేస్తున్నప్పటికీ పార్టీలో సరైన సమాచారం, గుర్తింపు ఇవ్వకపోవడం విచారకరమన్నారు. ఏ పార్టీలోకి వెళ్లేది లేదని చెప్పాడు.


ఎల్లమ్మతల్లికి భక్తుల ప్రత్యేక పూజలు


ఎల్లమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఖానాపురం: మండల కేంద్రంలో ఎల్లమ్మతల్లికి ప్రజలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ప్రతీ సంవత్సరం ఎల్లమ్మతల్లికి బోనాల సమర్పణ, ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉదయం అభిషేకాలు, హోమం పూజలు చేపట్టారు. గ్రామస్తులు వీరమనేని సాగర్‌రావు–మాధవి దంపతుల తో పాటు మరికొంత మంది ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం మహాఅన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం ఎల్లమ్మకు బోనాలను సమర్పించారు. రాత్రి ఒగ్గుకళాకారులతో కథలను చెప్పించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, కందుల సాంబయ్య ప్రత్యేక పూజలు చేశారు. రాగం సాంబయ్య, శ్రీనివాస్, సాంబయ్య, సత్యం, వెంకన్న, పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు సంతోషకరం

చెన్నారావుపేట : చేపలు పట్టడంపై పూర్తిస్థాయి హక్కులు ముదిరాజ్‌లకే ఉంటాయని హైకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషకరమని మెపా రాష్ట్ర అధ్యక్షుడు, ఉప్పరపల్లి వాసి పులి దేవేందర్ అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లో హైకోర్టు వద్ద న్యాయవాది డీఎల్.పాండు ముదిరాజ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా భూంపల్లి మండలం ఖాజీపురలో సభ్యత్వాల విషయమై రాజకీయ నాయకుల ఒత్తిడితో ముదిరాజ్‌లను గ్రామ బహిష్కరణ చేశారని తెలిపారు. హైకోర్టులో న్యాయవాది డీఎల్.పాండు ముదిరాజ్ వినిపించిన వాదనలను జడ్జి విని ముదిరాజ్‌లకు అనుకూలంగా తీర్పు ఇచ్చారని హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఖాజీపుర ముదిరాజ్ సొసైటీ అధ్యక్షుడు పెండెల గణేష్, ప్రధాన కార్యదర్శి పిట్ల భూపతి, పెండ్యాల కృష్ణ, శివ, చేరాలు, రవీందర్, రమేష్‌తోపాటు పలువురు ఉన్నారు.


హైకోర్టు న్యాయవాదితో పులి దేవేందర్

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



వర్ధన్నపేట: వరంగల్ ఎంపీ టికెట్ మాదిగలకు కేటాయించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశాడని ఎమ్మార్పీఎస్,ఎంఎస్పీ ప్రతినిధులు ఆరోపిస్తూ మంగళవారం వర్ధన్నపేటలోని అంబేడ్కర్ జంక్షన్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లాలో 75 శాతం ఉన్న మాదిగలకు ఎంపీ టికెట్ కేటాయించకపోవడం బాధాకరమన్నారు. మాదిగలంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో కడియం కావ్యను ఓడిస్తామని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకులు మాసాని గోపాల్ హెచ్చరించారు. గోలి సుధాకర్, నమిండ్ల సూర్య, దుర్గ ప్రసాద్, బిర్రు భిక్షపతి, జేరుపోతుల సుధాకర్, బిర్రు దయాకర్ పాల్గొన్నారు.

పల్లికి గిట్టుబాటు ధర చెల్లించాలి


ఇంటి వద్ద ఆరబోసిన పల్లికాయను చూపిస్తున్న రైతు శ్రీను

చెన్నారావుపేట : పల్లికి గిట్టుబాటు ధర చెల్లించాలని అక్కల్‌చెడ గ్రామ రైతు ఈర్ల శ్రీను డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన ఆందోళన చేసి మాట్లాడారు. తనకున్న ఎకరం భూమిలో వేరుశనగ పంట సాగు చేయగా సుమారు 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని తెలిపారు. ట్రాక్టర్ కిరాయికి తీసుకుని వరంగల్ మార్కెట్‌కు వెళ్లగా ధర రూ.4,500 నుంచి రూ.4,700 వరకు పలికిందని పేర్కొన్నారు. కానీ, మార్కెట్లో అడ్తి వ్యాపారులు వచ్చి పల్లికాయకు రూ.2,700 నుంచి రూ.3,000 ఉందని చెప్పారని తెలిపారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో మార్కెట్‌లో విక్రయించకుండా తిరిగి ఇంటికి తీసుకొచ్చినట్లు చెప్పారు.

క్లుప్తంగా

అధికార ప్రతినిధికి సన్మానం



ఖానాపురం: కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా ఎంపికైన తక్కళ్లపల్లి రవీందర్‌రావును అశోక్‌నగర్ యూత్ కాంగ్రెస్ నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రవీందర్‌రావు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం యువత పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మునేందర్, యాట రవికుమార్, మురళీ, కిరణ్, శ్రీకాంత్, హరీష్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ఓటు వేసేలా చైతన్యపర్చాలి



నర్సంపేట రూరల్ : లోకసభ ఎన్నికల్లో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసేలా చైతన్యపర్చాలని స్వీప్ నోడల్ అధికారి సత్యవాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి సారయ్య, ఏపీఎం మహేందర్, ఏసీడీపీఓ విద్య, మెప్మా ఏపీఎం వహీదా, టీజీఎస్ అధ్యక్షుడు నూకల కృష్ణమూర్తి, అంగన్‌వాడీ టీచర్లు, సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



నర్సంపేట: విద్యార్థిని చితకబాదిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్ డిమాండ్ చేశారు. ఏబీఎస్ఎఫ్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఖానాపురం మండలం బుధరావుపేటలోని బ్రిలియంట్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థిని చితకబాదిన సంఘటనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. విద్యార్థిని చితకబాదిన టీచర్‌పై, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు, రవితేజ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ అభ్యర్థిని కలిసిన నాయకులు



పర్వతగిరి: వరంగల్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్యను హనుమకొండలోని కడియం శ్రీహరి నివాసంలో మంగళవారం తెలంగాణ అంబేడ్కర్ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య, కాంగ్రెస్ మండల యూత్ నాయకులు బోయిని రవికుమార్‌యాదవ్, ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. కావ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బేసిక్ ఎలక్ట్రానిక్స్‌పై అవగాహన



నర్సంపేట రూరల్ : మండలంలోని లక్నెపల్లి జిల్లా పరిషత్ విద్యార్థులకు బిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో బేసిక్ ఎలక్ట్రానిక్స్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు వివిధ ఎలక్ట్రానిక్స్ కంపోనెంట్స్ గురించి క్లుప్తంగా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఏట సురేష్, బిట్స్ ఐఈఈఈ స్టూడెంట్ బ్రాంచ్ కౌన్సిలర్ డాక్టర్ మదు కుమార్, తదితరులు పాల్గొన్నారు.